అర్హులకు కౌలు కార్డులు మంజూరు చేయాలి

ప్రజాశక్తి - ఆచంట

మండలంలో అర్హులైన కౌలు రైతులను గుర్తించి తక్షణమే కౌలు కార్డులను మంజూరు చేయాలని జిల్లా వ్యవసాయాధికారి జెడ్.వెంకటేశ్వరరావు అన్నారు. స్థానిక మృత్యుంజయ వ్యవసాయ పరపతి సంఘ కార్యాలయంలో కౌలురైతుల కార్డుల జాతాపై తహశీల్దార్, విఆర్ఒ, విఎఎలతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామ కమిటీ సభ్యులు, గ్రామ విఆర్ఒలు, విఎఎలు పరస్పర సహకారంతో కౌలురైతు కార్డులను వేగవంతం చేయాలని పిలుపునిచ్చారు. మండలంలోని కౌలు కార్డుకు త్వరితగతిన దరఖాస్తులు చేసుకుని సిసిఆర్ఎస్ కార్డులు పొందాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా కార్డుల వల్ల కలిగే ప్రయోజనాల గురించి వివరించారు. కార్యక్రమంలో పాలకొల్లు ఎడిఎ అడ్డాల పార్వతి, తహశీల్దార్ సుబ్రహ్మణ్యం, ఆర్ఐ జయలలిత, మండల వ్యవసాయ విస్తరణాధికారి బి.నాగరాజు పాల్గొన్నారు.

విద్యాకేంద్రమా.. వ్యాపార కేంద్రమా

ప్రయివేటు విద్యాసంస్థల్లో పుస్తకాల వ్యాపారంపై ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యాన ఆందోళన

ప్రజాశక్తి - భీమవరం

ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా పుస్తకాల వ్యాపారం చేస్తున్న శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌పై చర్యలు తీసుకోవాలని ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు పి.వాసు డిమాండ్ చేశారు. జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా ప్రయివేట్, కార్పొరేట్ విద్యాసంస్థల్లో పుస్తకాల అమ్మకాన్ని నిరసిస్తూ కుముదవల్లి శ్రీ చైతన్య టెక్నో స్కూల్‌లో పుస్తకాల అమ్మకాన్ని ఎస్ఎఫ్ఐ నాయకులు గురువారం అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో స్కూల్ యాజమాన్యం, ఎస్ఎఫ్ఐ నాయకుల మధ్య వాగ్వివాదం చోటుచేసుకుంది. దీంతో స్కూల్ ఎదుట ఎస్ఎఫ్ఐ నాయకులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా వాసు మాట్లాడుతూ ప్రభుత్వ నిబంధనలను పాటించకుండా బహిరంగంగా పుస్తకాలు అమ్ముతున్నారని ఆరోపించారు. విద్యాసంస్థల పేరుతో కోట్లాది రూపాయల వ్యాపారం

స్కూల్ వద్ద ఆందోళన చేస్తున్న నాయకులు

చేస్తున్నా విద్యాశాఖ అధికారులు కనీసం పట్టించుకోకపోవడం దుర్మార్గమన్నారు. పట్టణ కార్యదర్శి టి.ప్రసాద్ మాట్లాడుతూ విద్యా శాఖాధికారులు పూర్తి స్థాయిలో తనిఖీలు నిర్వహించకపోవడం వల్ల ప్రయివేటు విద్యాసంస్థలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్నారు. ఇప్పటికైనా మొద్దునిద్ర వీడి పాఠశాల తనిఖీలు నిర్వహించాలన్నారు. లేనిపక్షంలో జిల్లావ్యాప్తంగా విద్యార్థులను, తల్లిదండ్రులను సమీకరించి పోరాడతామని, దీనికి జిల్లా యంత్రాంగమే బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు. అనంతరం పుస్తకాల వ్యాపారం విషయాన్ని జిల్లా విద్యాశాఖ అధికారుల దృష్టికి ఎస్ఎఫ్ఐ నాయకులు తీసుకెళ్లారు. ఈ నేపథ్యంలో విద్యాశాఖ అధికారులు అక్కడికి చేరుకుని పుస్తకాలు భద్రపరచిన గదిని, పుస్తకాలను పరిశీలించి యాజమాన్యానికి నోటీసులు జారీ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు యు.వినోద్, బి.గణేష్, పి.మోహిని, ఎం.శివ, జి.శ్రీను, కె.యశ్వంత్, ఎస్.లక్ష్మణ్ పాల్గొన్నారు.

బదిలీల్లో పొరపాట్లకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలి

యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి గోపీమూర్తి

డిఇఒకు వినతి

ప్రజాశక్తి - భీమవరం

ఉపాధ్యాయుల బదిలీల్లో జరిగిన పొరపాట్లకు బాధ్యులపై చర్యలు తీసుకోవాలని యుటిఎఫ్ రాష్ట్ర కోశాధికారి బి.గోపీమూర్తి డిమాండ్ చేశారు. స్థానిక కలెక్టరేట్లో డిఇఒ ఆర్‌వి.రమణకు గురువారం యుటిఎఫ్ నేతలు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా గోపీమూర్తి మాట్లాడుతూ జిల్లాలో ఉన్న ఖాళీలు వెబ్ ఆప్షన్లలో చూపించకుండా, లేని ఖాళీలు చూపించడం వల్ల ఉపాధ్యాయులు తీవ్ర నష్టానికి గురయ్యారన్నారు. ఖాళీలు చూపించడంలో లోపాలకు కారకులైన వారిపై శాఖాపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. శృంగవృక్షం జెడ్‌పి హైస్కూల్‌లో బిఎస్‌గా ఎలెక్ట్ చేసిన రవికుమార్‌కు దగ్గరలో ఉన్న విస్సాకోడేరు హైస్కూల్‌కు అలాట్‌మెంట్ ఇవ్వాలన్నారు. ఆచంట జెడ్‌పి హెచ్ఎస్, వేడంగిపాలెం ఎంపియుపి, బొండాడ జెడ్‌పిహెచ్ఎస్ లేకపోయినా చూపించారని వివరించారు. ఇటువంటివి జిల్లాలో అనేకం ఉన్నాయన్నారు. తక్షణమే వీటిపై విచారణ జరిపి శాఖాపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. లేనిపక్షంలో డిఇఒ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో యుటిఎఫ్ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు పిఎస్.విజయరామరాజు, ఎకెవి.రామభద్రం, కోశాధికారి పట్టాభిరామయ్య, జిల్లా కార్యదర్శులు, నేతలు పాల్గొన్నారు.

జిల్లా విద్యాశాఖ అధికారికి వినతిపత్రం అందజేస్తున్న యుటిఎఫ్ నేతలు

పోలవరం నిర్వాసితుల సమస్యలు పట్టని మోడీ

సాగుతున్న పాదయాత్ర

కేంద్ర బిజెపి ప్రభుత్వానికి భజన చేస్తున్న పార్టీలకు బుద్ధి చెప్పండి

సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

పోరుకేక పాదయాత్రకు ఆదివాసీల బ్రహ్మరథం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం ప్రతినిధి, కూనవరం విలేకరి

పోలవరం నిర్వాసితుల సమస్యలను కేంద్రంలోని మోడీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. రాష్ట్ర ప్రజలకు అన్యాయం చేసిన బిజెపికి భజన చేస్తున్న రాష్ట్రంలోని బానిస పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని ప్రజలకు పిలుపునిచ్చారు. పోలవరం నిర్వాసితుల సమస్యలపై సిపిఎం ఆధ్వర్యాన చేపట్టిన పోరుకేక పాదయాత్ర మూడో రోజు గురువారం సమరోత్సాహంతో సాగింది. మధ్యాహ్నం పాదయాత్ర భగవాన్‌పురం మెయిన్ రోడ్డు మీదుగా రాత్రికి కూటూరుకు చేరుకుంది. ముల్లూరు గ్రామ ప్రజలు తమ సమస్యలపై బృందానికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా భగవాన్‌పురం, ముల్లూరు, కూటూరు గ్రామాల్లో జరిగిన సభల్లో శ్రీనివాసరావు మాట్లాడుతూ ఇక్కడ మునిగిపోదామా.. తిరుగుబాటు చేద్దామా? అని ప్రజలను ప్రశ్నించారు. ప్రభుత్వాలు అడవి నుండి, భూమి నుంచి వేరు చేద్దామని చూస్తున్నాయని, ఎర్రజెండా నాయకత్వంలో పోరాటాలకు సిద్ధం కావాలని పిలుపునిచ్చారు. పాదయాత్ర జరుగుతున్న 15 రోజుల్లో ప్రభుత్వం స్పందించకపోతే జులై 4న బృహత్తర కార్యాచరణ ప్రకటిస్తామని చెప్పారు. పోలవరం నిర్వాసితులు ఒంటరి వాళ్లు కాదని, రాష్ట్ర వ్యాప్తంగా మద్దతు కూడగడతామని చెప్పారు. 45 కాంటూరులో ఉన్న గ్రామం పోలవరం ప్రాజెక్ట్ పూర్తి కాక ముందే ముంపునకు గురైందని, కాంటూరు లెక్కల్లో డొల్లతనానికి ఇది ఒక ఉదాహరణ అని పేర్కొన్నారు. ప్రజా సమస్యలు పట్టించుకోని స్థానిక ఎమ్మెల్యే గ్రామాల్లోకి వస్తే ప్రజలు తరిమేందుకు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. వైఎస్ జగన్ ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీల్లో ఆర్ అండ్ ఆర్ ప్యాకేజీ రూ.10 లక్షలు, గతంలో ఎకరాకు రూ.1.15 లక్షలు ఇచ్చిన భూములకు రూ.5 లక్షలు, 18 ఏళ్ల నిండిన యువతీ యువకులకు ఆర్అండ్ఆర్ ప్యాకేజీ చెల్లించాలని అన్ని పంచాయతీల్లో తీర్మానం చేసి ప్రభుత్వాన్ని నిలదీయాలని పిలుపునిచ్చారు.



పాదయాత్రలో పాల్గొన్న జాతీయ నేత బి.వెంకట్

పాదయాత్రలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు

పాదయాత్రకు బ్రహ్మ రథం

సిపిఎం పోరుకేక పాదయాత్రకు ప్రజలు బ్రహ్మరథం పట్టారు. భగవాన్‌పురం గ్రామంలో స్థానిక మహిళలు కుంకుమ దిద్ది హారతి పట్టారు. గ్రామానికి చెందిన పులి వెంకమ్మ మాట్లాడుతూ తమ గ్రామం ముంపునకు గురైనప్పుడు ఎవరూ ఆదుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. వరదల సమయంలో తమ కుటుంబం పడిన ఇబ్బందులు వివరించారు. మళ్లీ వర్షాకాలం ప్రారంభం కావడంతో వరద భయం వెంటాడుతుందని తెలిపారు. తమ గ్రామంలో ఉపాధి హామీ పనులు సైతం కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పాదయాత్ర ముల్లూరు గ్రామానికి చేరుకుంది. అక్కడి ప్రజలు పూలమాలలతో స్వాగతం పలికారు. రాత్రి తొమ్మిదైనా పోరుకేక పాదయాత్ర కోసం వేచి చూడడం వారిలో సిపిఎంపై ఉన్న నమ్మకానికి దర్పణం పట్టింది. కేవలం 150 గడపలు ఉన్న గ్రామంలో యువత పోరుకేక నిర్వహణకు ఆర్థిక సహాయం అందజేశారు. గ్రామ యువకుడు పొద్దేటి అశోక్ మాట్లాడుతూ వరదల సమయంలో తమకు సిపిఎం మాత్రమే అండగా నిలిచిందన్నారు. జులై 4వ తేదీన విజయవాడలో జరిగే సభకు అందరం వెళ్తామని చెప్పారు. అనంతరం పాదయాత్ర కూటూరు గ్రామానికి చేరింది. అక్కడ నాయకులు బస చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం ఎఎస్ఆర్ రంపచోడవరం జిల్లా కార్యదర్శి బొప్పెన కిరణ్, నాయకులు మేకల నాగేశ్వరరావు, తెల్లం రామకృష్ణ, మొడియం నాగమణి, కుంజా రాధ, అజయ్, విఆర్.పురం ఎంపిపి కారం లక్ష్మి, కూనవరం వైస్ ఎంపిపి కొమరం పెంటయ్య, శ్రీరామగిరి సర్పంచి పులి సంతోష్‌కుమార్, పెదర్కూర్ సర్పంచి మడకం నాగమణి, పెదర్కూర్ ఎంపిటిసి అమ్మాజీ, కూటూరు సర్పంచి బొగ్గా వెంకమ్మ పాల్గొన్నారు.

నష్టపోయిన రైతులను ఆదుకోవాలి

రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య

ప్రజాశక్తి - పెనుమంట్ర

అకాల వర్షాలకు నష్టపోయిన రైతులను ఆదుకోవాలని రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. రైతు సంఘం జిల్లా విస్తృత సమావేశం గురువారం బ్రాహ్మణ చెరువులో సాయినాథ్ కళ్యాణ మండపంలో జిల్లా ఉపాధ్యక్షులు చింతకాయల బాబూరావు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య పాల్గొని మాట్లాడారు. గతేడాది నవంబర్ డిసెంబరులో, ఈ ఏడాది ఏప్రిల్, మేలో కురిసిన అకాల వర్షాలకు పంటలు దెబ్బతిని రైతాంగం తీవ్రంగా నష్టపోయిందన్నారు. ప్రభుత్వం విత్తనం నుండి విక్రయం వరకూ చూసుకుంటాయని చెప్పినప్పటికీ వ్యాపారులు మాత్రమే పెత్తనం సాగించారన్నారు. నష్టపోయిన రైతులను ఆదుకోవాలని కోరుతూ ఈ నెల 30న విజయవాడ ధర్నా చౌక్ వద్ద మహాధర్నా నిర్వహించనున్నామని, రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు.

మాట్లాడుతున్న రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు కృష్ణయ్య

ఈ మహాధర్నాలో పంటలకు మద్దతు ధర, ఇన్‌పుట్ సబ్సిడీ, పంటల బీమా, వడ్డీ రాయితీలు కల్పించాలని, ఆక్వా రైతుల, సాగునీరు, భూ సమస్యలు, విత్తనాలు, ఉద్యాన పంటలు, పాడి రైతుల సమస్యలు పరిష్కరించాలని, ఉచిత విద్యుత్ కొనసాగించాలని, స్మార్ట్ మీటర్లు ఆపాలని కోరారు. మహాధర్నాను జయప్రదం చేయాలని విజ్ఞప్తి చేశారు. రైతు సంఘం జిల్లా కార్యదర్శి ఆకుల హరే రామ్ మాట్లాడుతూ జిల్లాలో నారుమడులు వేయడానికి నీరందక రైతులు చాలా ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం మహాధర్నా గోడపత్రికను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో చిర్ల పుల్లారెడ్డి, కిలారి తవిటి నాయుడు, మార్టిన్ లూథర్, ఏళ్లబండి నారాయణమూర్తి, అయినంపూడి బాబూరావు, బొర్రా అలమహారాజు, చింతపల్లి లక్ష్మీకుమారి, పెచ్చెట్టి సత్యనారాయణ పాల్గొన్నారు.

రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం

ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు

ప్రజాశక్తి - నరసాపురం టౌన్

ప్రజల సౌకర్యార్థం నియోజకవర్గంలో రోడ్ల నిర్మాణ పనులు వేగవంతం చేసి సకాలంలో అందుబాటులోకి తీసుకొస్తామని ప్రభుత్వ చీఫ్‌విప్ ముదునూరి ప్రసాదరాజు తెలిపారు. గురువారం లక్ష్మణేశ్వరం గ్రామంలో మల్లిపూడి మెరక వద్ద 20 కోట్ల రూపాయల నిధులతో లక్ష్మణేశ్వరం నుంచి ఎల్‌బిచర్ల మీదుగా పిఎంలంక రహదారి నిర్మాణ పనులకు ముదునూరి ప్రసాదరాజు భూమిపూజ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుమారు 16 గ్రామాలను అనుసంధానం చేస్తున్న ఈ రహదారి అభివృద్ధి వల్ల ప్రజలకు చాలా మేలు జరుగుతుందన్నారు. భవిష్యత్తులో వశిష్ట గోదావరి జాతీయ రహదారికి అనుసంధానం చేసుకుంటూ వెళ్తుందని తెలిపారు. ముఖ్యమైన రహదారిని శాశ్వతంగా నిర్మించుకునేందుకు సిసి రహదారిగా మార్చి రహదారి రెండు వైపులా వెడల్పు పెంచి నిర్మిస్తున్నామన్నారు. ఈ ఏడాది నరసాపురం నియోజకవర్గంలో సుమారు రూ.70 కోట్ల నిధులతో 12 ఆర్అండ్‌బి రోడ్లు నిర్మిస్తున్నామన్నారు. లక్ష్మణేశ్వరం నుండి ఎల్‌బి.చర్ల మీదుగా పిఎంలంక రహదారితో కలిపి నాలుగు రోడ్ల పనులు నిర్మాణంలో ఉన్నాయని, మిగిలిన రహదారులు టెండర్ల ప్రక్రియ పూర్తి చేసుకొని త్వరలోనే నిర్మాణాలు ప్రారంభిస్తామని తెలిపారు. నరసాపురం, మొగల్తూరు జాతీయ రహదారిలో ఉన్న లూథరన్ పెద్ద చర్చి నుంచి లక్ష్మణేశ్వరం గోపురం గుడి వరకూ ఆర్అండ్‌బి రహదారి కూడా వెడల్పు పెంచి నిర్మించాలన్న ఆలోచనతో 4 కోట్లు నిధులు మంజూరు చేసుకున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎఎంసి ఛైర్మన్ గుబ్బల రాధాకృష్ణ, జెడ్‌పిటిసి బొక్కా రాధాకృష్ణ, వైస్ ఎంపిపి ఉంగరాల రమేష్ నాయుడు, ఎంపిటిసి కొలపత్తి రామకృష్ణ, సర్పంచి తిరుమని వెంకట్ రాజు పాల్గొన్నారు.

పనులను ప్రారంభిస్తున్న ప్రజా ప్రతినిధులు

మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ ప్రశాంతి

పాఠశాలలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దాలి

కలెక్టర్ ప్రశాంతి

ప్రజాశక్తి - భీమవరం

పాఠశాలల ఆవరణలను ఆహ్లాదకరంగా తీర్చిదిద్దేందుకు విద్యాశాఖాధికారులు కృషి చేయాలని జిల్లా కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్లో గురువారం మనబడి నాడు-నేడు పనుల పురోగతిపై సంబంధిత విద్యాశాఖాధికారులతో ఆయన సమీక్షించారు. మన ఇంటిలానే పాఠశాల వాతావరణం కూడా ఆహ్లాదకరంగా ఉండేలా విద్యాశాఖాధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. పాఠశాలల ఆవరణల్లో అవసరం మేరకు లెవిలింగ్ పనులు చేపట్టాలని సూచించారు. ఆవరణలో మొక్కలు నాటించి పచ్చదనాన్ని అభివృద్ధి చేయాలన్నారు. మురుగునీరు పారుదలలో ఇబ్బంది ఉంటే వెంటనే సరిచేయించాలన్నారు. నాడు-నేడు పనుల్లో నిర్లక్ష్యం వహిస్తే ఇక నుండి హెచ్చరికలు ఉండవని, నేరుగా చర్యలే ఉంటాయని తెలిపారు. మెటీరియల్ ఇతర ఖర్చుల్లో అవకతవకలు జరిగితే ఉపేక్షించేది లేదన్నారు. మిగిలి ఉన్న పనులను కూడా వారంలోపు పూర్తి చేయాలని ఆదేశించారు. జగనన్న విద్యాకానుక కిట్లను నూరుశాతం పంపిణీని పూర్తి చేయాలన్నారు. బడి బయట పిల్లలు ఎట్టి పరిస్థితుల్లో ఉండకూడదని తెలిపారు. నూతనంగా కేటాయించిన ఎంఇఒ-2 పాఠశాలల తనిఖీలు ముమ్మరంగా నిర్వహించాలన్నారు. కనీసం వారంలో నాలుగు పాఠశాలలను సందర్శించి లోటుపాట్లపై నివేదికను అందజేయాలన్నారు. ఈ సమావేశంలో డిఇఒ ఆర్.వెంకటరమణ, ఎస్ఎస్ఎ పిఒ పి.శ్యామ్‌సుందర్, విద్యాశాఖాధికారులు పాల్గొన్నారు.

జగనన్న సురక్ష విజయానికి కృషి చేయాలి

జగనన్న సురక్ష కార్యక్రమం విజయవంతానికి అధికారులు కృషి చేయాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. స్థానిక కలెక్టరేట్ నుంచి గురువారం స్థానిక వీడియో కాన్ఫరెన్స్ హాలు నుండి ఆమె జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డితో కలిసి జగనన్న సురక్ష విధివిధానాలపై సంబంధిత అధికారులు, సిబ్బందికి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా దిశానిర్దేశం చేశారు. కలెక్టర్ ప్రశాంతి మాట్లాడుతూ జగనన్న సురక్ష విధివిధానాలను పూర్తిగా అవగాహన చేసుకుని ప్రజల అవసరాలకు అనుగుణంగా సమస్యల పరిష్కారానికి కృషి చేయాలన్నారు. ఈ నెల 24 నుండి వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది ఇంటింటికి వెళ్లి కార్యక్రమాన్ని వివరించడంతోపాటు వారికి అవసరమైన సేవలను నమోదు చేసుకుని సిద్ధంగా ఉంచాలన్నారు. జులై ఒకటో తేదీ నుండి గ్రామ, వార్డు సచివాలయాల వద్ద ప్రత్యేక క్యాంపులను నిర్వహిస్తామన్నారు. సచివాలయాల వద్ద నిర్వహించే క్యాంపుల్లో 11 సర్వీసులకు ఎలాంటి సర్వీసు ఛార్జీలూ ఉండవని తెలిపారు. మ్యూటేషన్ ఆఫ్ ట్రాన్సక్షన్‌కు సంబంధించి, పాస్ పుస్తకాల జారీకి దరఖాస్తుదారులు చెల్లించాల్సిన స్టాట్యుటరీ చార్జీలను మాత్రం వసూలు చేస్తారన్నారు. నాలుగు వారాలపాటు ఈ కార్యక్రమం నిర్వహిస్తారన్నారు. కార్యక్రమంలో జిల్లా గ్రామ, వార్డు సచివాలయాల అధికారి కెసిహెచ్.అప్పారావు, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మొక్కుబడిగా కౌలురైతుల గుర్తింపు సభలు

ఎపి కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి ఎం.రామాంజనేయులు

ప్రజాశక్తి - పోడూరు

కౌలురైతుల గుర్తింపు కార్డుల కోసం నిర్వహిస్తున్న గ్రామసభలు మొక్కుబడిగా జరుగుతున్నాయని ఆంధ్రప్రదేశ్ కౌలురైతుల సంఘం జిల్లా కార్యదర్శి మామిడిశెట్టి రామాంజనేయులు విమర్శించారు. గుమ్మలురులో గురువారం జరిగిన కౌలురైతుల గ్రామసభలో పాల్గొన్న ఆయన పలు సమస్యలు తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. కౌలురైతుల గుర్తింపు గ్రామసభ జరుగుతున్నట్లుగా విఆర్ఒచే గ్రామంలో టాంటాం వేయించి ప్రచారం చేయాలని, అలా చేయకపోవడంతో కౌలురైతులు పెద్దగా హాజరు కాలేదని రామాంజనేయులు విమర్శించారు. భూయజమాని సంతకం చేయాలనే నిబంధనతో భూయజమానులెవరూ సంతకం చేయడం లేదన్నారు. దీంతో కౌలురైతులు కష్టపడి పండించిన పంట కూడా అమ్ముకునే పరిస్థితి లేదన్నారు. ఇస్తున్న కౌలు కార్డుల్లో సగం తిరిగి భూయజమానుల పేరునే ఇచ్చి కౌలురైతులకు ఇస్తున్నామని చెబుతున్నారని తహశీల్దార్ దృష్టికి తీసుకెళ్లారు. వాస్తవ సాగుదారులైన కౌలురైతులను ప్రభుత్వమే గుర్తించి కార్డులిచ్చి ప్రభుత్వ రాయితీలు ఇవ్వాలని కోరారు. ఈ సందర్భంగా తహశీల్దార్ మాట్లాడుతూ కౌలురైతులకు గుర్తింపు కార్డులు ఇవ్వడం వల్ల భూయజమానులకు ఎలాంటి నష్టమూ ఉండదని అన్నారు. ప్రకృతి విపత్తుల సమయంలో కౌలురైతులు మరింత నష్టపోతున్నారని, మానవతా దృక్పథంతో భూయజమానులు ఆలోచించాలని కోరారు.

సంక్షేమ పథకాల అమలు ఘనత జగన్‌దే

ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ

ప్రజాశక్తి - తాడేపల్లిగూడెం

రాష్ట్రంలో 5.35 కోట్ల మందికి గాను 87 శాతం మందికి ప్రభుత్వ పథకాలు అందాయని రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొట్టు సత్యనారాయణ అన్నారు. గురువారం తాడేపల్లిగూడెం క్యాంపు కార్యాలయంలో జగనన్న సురక్ష పథకంపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దేశ చరిత్రలో 99.5 శాతం పథకాలు అమలు చేసిన ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డికే దక్కుతుందన్నారు. జగనన్న సురక్ష పథకం అధికారిక కార్యక్రమం అని తెలిపారు. దీనిపై ప్రతి జిల్లాకూ ఒక ఐఎఎస్ అధికారిని నియమించినట్లు తెలిపారు. అలాగే మండల స్థాయిలో మండల లెవెల్ అధికారి ఉంటారన్నారు. ఈ నెల 23వ తేదీ నుంచి ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందన్నారు. ప్రభుత్వం ఇచ్చిన ఫార్మెట్ ఆధారంగా ప్రజల నుంచి సమాధానాలు రాబట్టాలన్నారు. సమస్యలుంటే వాటిని టోకెన్ సిస్టమ్ ద్వారా ఎనిమిదో రోజు శిబిరంలో సమస్యలు పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపిలు శేషులత, దాసరి హైమావతి, వైసిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

కేంద్రం నిధులతో రాష్ట్రం ప్రచారం

కేంద్ర ఆరోగ్యశాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవర్

ప్రజాశక్తి - పాలకొల్లు

రాష్ట్ర ప్రభుత్వం కేంద్రం నిధులను మళ్లించి తమ సొంత పథకాల కింద ప్రచారం చేసుకొంటోందని కేంద్ర ఆరోగ్య శాఖ సహాయ మంత్రి భారతీ ప్రవీణ్ పవర్ చెప్పారు. పాలకొల్లులో మహాజన సంపర్క్ అభియాన్ కింద మోడీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా స్థానికంగా ఏర్పాటు చేసిన బహిరంగ సభలో మంత్రి మాట్లాడారు. గత కాంగ్రెస్ ప్రభుత్వం 50 సంవత్సరాల్లో చేసిన దానికన్నా మూడు రెట్లు అభివృద్ధి తొమ్మిదేళ్లలో జరిగిందన్నారు. రాష్ట్రంలో ఇసుక, మద్యం, మట్టి పేరిట దోపిడీ సాగుతోందని బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు సోము వీర్రాజు అన్నారు. రాష్ట్రంలో వైసిపి ఇసుక లారీ రూ.5 వేలకు అమ్మితే తాము రూ.4 వేలకే ఇస్తామని ప్రకటించారు. సభలో బిజెపి నేతలు పాకా సత్యనారాయణ, నారిన తాతాజీ, ఉన్నమట్ల కబర్థి, యర్రంశెట్టి పద్మారావు, జక్కంపూడి కుమార్ పాల్గొన్నారు.

ఫారం - 16 జారీ ప్రక్రియ ప్రారంభం

ప్రజాశక్తి - భీమవరం

భీమవరం సబ్ ట్రెజరీ పరిధిలో పెన్షనర్లకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి గాను ఫారం-16 జారీ ప్రక్రియ ప్రారంభించినట్లు ఉప ఖజానా అధికారి ఎ.రవివర్మ తెలిపారు. ఈ ఫారం 16కు సంబంధించిన పత్రాలను రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ గాతల జేమ్స్, ఇతర రిటైర్డ్ ఉద్యోగులు గురువారం అధికారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఉప ఖజానాధికారి రవివర్మ మాట్లాడారు. ఫారం-16తో పాటు ఇన్కంటాక్స్ రికవరీ జరిగిన పెన్షనర్ల పాన్ కార్డు వివరాలతో స్వయంగా గానీ లేదా వారి తరపున వచ్చిన వ్యక్తి సబ్ ట్రెజరీ కార్యాలయంలో సంప్రదించాలన్నారు. 805 మంది పెన్షనర్స్ ఈ ఇకెవైసి చేయించుకోవాల్సి ఉందన్నారు. భవిష్యత్‌లో ఆధార్ ఆధారిత పెన్షన్ పేమెంట్ ఉండొచ్చన్నారు. వీలైనంత తొందరగా పెన్షనర్లంతా ఇకెవైసి చేయించుకోవాలని కోరారు.



ఉప ఖజానాధికారికి ఫారం అందిస్తున్న రిటైర్డ్ ఉద్యోగుల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు జేమ్స్

పూలపల్లిలో గడపగడపకూ మన ప్రభుత్వం

పాలకొల్లు రూరల్: పూలపల్లి గ్రామంలో 124వ రోజు గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ నిర్వహించారు. దానిలో భాగంగా ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాల గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి లబ్ధిదారికి లబ్ధి చేకూరే విధంగా పథకాలను రూపొందించారని తెలిపారు. అందువల్ల ఎక్కడికి వెళ్లినా ప్రజలు బ్రహ్మరథం పడుతున్నారన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎంఎల్‌సి మేకా శేషుబాబు, మాజీ డిసిఎంఎస్ యడ్ల తాతాజీ, పాలకొల్లు మండల జెడ్‌పిటిసి నడపన గోవిందరాజుల నాయుడు, మండల కన్వీనర్ మైఖేల్ రాజు, ఎంపిపి చిట్టూరి కనకలక్ష్మి పాల్గొన్నారు.

'వైసిపి పాలనలతో బిసిలపై దాడులు'

భీమవరం రూరల్: టిడిపి బిసి రజక సాధికార కమిటీ జిల్లా ఆత్మీయ సమావేశం పట్టణంలో ఛాంబర్ ఆఫ్ కామర్స్ హాల్లో ఎంఎల్‌సి టిడిపి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దువ్వారపు రామారావు అధ్యక్షతన గురువారం జరిగింది. ఈ సమావేశంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న టిడిపి బిసి ఫెడరేషన్ అధ్యక్షుడు కొల్లు రవీంద్ర మాట్లాడుతూ జగన్ పాలన మొత్తం బిసిలపై దాడులు చేయడమే పనిగా సాగిందన్నారు. రానున్న ఎన్నికల్లో చంద్రబాబును ముఖ్యమంత్రిని చేసి బిసిలకు రక్షణ చట్టాన్ని ఏర్పాటు చేసుకుందామని పిలుపునిచ్చారు. మాజీ మంత్రి పితాని సత్యనారాయణ మాట్లాడుతూ చంద్రబాబు ప్రభుత్వ హయాంలో బిసి కార్పొరేషన్ ద్వారా వారికి సబ్సిడీతో ఆర్థిక సహాయాన్ని అందించేవారిన్నారు. ఎండి షరీఫ్ మాట్లాడుతూ టిడిపి ఏర్పడినప్పటి నుండి అనేకమంది బిసి నాయకులకు చట్ట సభల్లో ప్రాతినిధ్యం కల్పిస్తూ అనేక రాజకీయ పదవులను లబ్ధి చేకూర్చారన్నారు. ఈ సమావేశంలో రజక సాధికార కమిటీ రాష్ట్ర కన్వీనర్ గుర్రపుసాల రామకృష్ణ పాల్గొన్నారు.

విద్యార్థులకు కంటి పరీక్షలు

గణపవరం: కంటి చూపు పట్ల అశ్రద్ధ పనికిరాదని పిప్పర పిహెచ్‌సి డాక్టర్ కె.ప్రియాంక తెలిపారు. గురువారం పిప్పర, కేశవరం గ్రామాల్లో ఏర్పాటు చేసిన కంటి వెలుగు కార్యక్రమంలో డాక్టర్ మాట్లాడారు. ప్రభుత్వం ఏర్పాటు చేసిన కంటి వెలుగులో పరీక్షలు చేయించుకుని సమస్యను పరిష్కరించుకోవాలన్నారు. అనంతరం స్థానిక హైస్కూల్ విద్యార్థులకు పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి కళ్ల జోళ్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో గణపవరం సిహెచ్‌ఒ జాలాది విల్సన్‌బాబు, గణపవరం రెండో ఎంఇఒ జి.బాలయ్య, ఆరోగ్య సహాయకులు రాజు పాల్గొన్నారు.

విద్యా సామగ్రి అందజేత

పాలకొల్లు: పట్టణంలోని జివిఎస్‌విఆర్‌ఎం మున్సిపల్ పాఠశాలయ విద్యార్థులకు గురువారం దాతల సహకారంతో విద్యా సామగ్రిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎంఇఒ-2 ఆర్‌ఎన్‌విఎస్‌జి.శర్మ మాట్లాడుతూ ప్రభుత్వం విద్యకు చేస్తున్న తోడ్పాటుకు అదనంగా దాతల సహకారం తోడవ్వడంతో విద్యార్థులు చక్కటి విద్యనభ్యసించి ఉన్నత స్థానాలకు చేరాలని కోరారు. అనంతరం పాఠశాల ఆవరణను పరిశీలించి సంతృప్తి చెందారు పాల్గొన్నారు.

అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలి

వీరవాసరం: పార్టీలకు అతీతంగా పని చేసినప్పుడు అభివృద్ధి వేగంగా జరుగుతుందని ఎంపిపి వీరవల్లి దుర్గాభవాని అన్నారు. మండల పరిషత్ నిధులు రూ.6 లక్షలతో బొబ్బనపల్లి గ్రామం ఎస్‌సి కాలనీలో చేపట్టబోయే పనులను ఎంపిపి గురువారం ప్రారంభించారు. మండలంలో మండల పరిషత్ నిధులతో చేపట్టబోయే పనులను తక్షణం పూర్తి చేసుకునే విధంగా ఆయా గ్రామాల ప్రజా ప్రతినిధులు చొరవ తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎంపిటిసి కందుకూరి విజయలక్ష్మి, మాజీ ఎంపిటిసి గూడూరి రామాంజనేయులు, టిడిపి నాయకులు చంద్రశేకర్ పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమస్యలు పరిష్కరించాలి

మొగల్తూరు: ఆశా వర్కర్ల న్యాయమైన సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తెలగంశెట్టి సత్యనారాయణ డిమాండ్ చేశారు. గురువారం మొగల్తూరులో ఆశా వర్కర్ల జనరల్ బాడీ సమావేశం గురువారం నిర్వహించారు. ఈ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సుప్రీంకోర్టు ఆదేశాల మేరకు ఆశా వర్కర్లకు కనీసం రూ.26,000 ఇవ్వాలని, ఆశా వర్కర్లను హెల్త్ వర్కర్లుగా గుర్తించి అర్హత కలిగిన వారిని ఎఎన్‌ఎంలుగా తీసుకోవాలని అన్నారు. ఇఎస్‌ఐ, పిఎఫ్ అమలు చేయాలని, గ్రూప్ ఇన్సూరెన్స్ చేయించాలని తెలిపారు. కార్యక్రమంలో ఆశా వర్కర్లు ఎస్.ఈశ్వరి, టి.వరలక్ష్మి, ఎ.వరలక్ష్మి, కె.నాగరాణి, పి.రేవతి, కె.సత్యవతి, పి.బేబి కుమారి, కె.నాగరాణి, పి.రేవతి, ఎ.కోమలి పాల్గొన్నారు.

1 నుంచి ఉండిలో జగనన్న సురక్ష

ఉండి: జూలై 1 నుంచి మండల వ్యాప్తంగా జగనన్న సురక్ష కార్యక్రమాన్ని ప్రారంభించనున్నట్లు మండల పరిషత్ అభివృద్ధి అధికారి అడబాల వెంకట అప్పారావు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. జూన్ 23వ తేదీ నుంచి జగనన్న సురక్ష ప్రారంభించబడుతుందని అయితే మండల వ్యాప్తంగా జులై 1 నుంచి ప్రారంభిస్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమం ద్వారా సచివాలయ సిబ్బంది, అధికారులు గ్రామాల్లో ఇంటింటికీ వెళ్లి వారికి ప్రభుత్వం ద్వారా లభించిన లబ్ధిని తెలియజేసి, సమస్యలు తెలుసుకొని పరిష్కారానికి కృషి చేయాలని వారు తెలిపారు.

చౌడు నేలలో పంట నష్టమే

ఉండి: చౌడు నేలలో వరి సాగు చేస్తున్నప్పుడు దిగుబడులు తగ్గడం లేదా పూర్తి పంట నష్టం వాటిల్లడం జరుగుతోందని కెవికె పంటల యాజమాన్యం శాస్త్రవేత్త డాక్టర్ పి.వినయలక్ష్మి తెలిపారు. ఈ సందర్భంగా వినయలక్ష్మి మాట్లాడుతూ రాష్ట్రంలో రొయ్యల, చేపల చెరువుల సంఖ్య రోజురోజుకూ పెరిగిపోవడం వల్ల నేలలు చౌడుబారుతున్నాయన్నారు. మార్టేరు వ్యవసాయ పరిశోధన స్థానం నుండి 2022లో చౌడు నేలను తట్టుకుని తక్కువ కాలపరిమితితో హెక్టారుకు మూడు నుంచి నాలుగు టన్నుల వరకూ, మామూలు నేలలో ఆరు టన్నుల వరకు దిగుబడినిచ్చే ఎంటియు 1298 సన్నగింజ రకం విడుదల చేశారన్నారు. జీవ సాంకేతిక పరిజ్ఞాన పద్ధతి ద్వారా ప్రాచుర్యంలో ఉన్న ఎంటియు 1010 రకంతో ఎఫ్‌ఎల్ 478 రకం నుండి సాల్టాల్ జన్యువును బ్యాక్ గ్రాస్ బ్రీడింగ్ పద్ధతిలో చొప్పించి రూపొందించబడిన రకం అన్నారు.

ఆదర్శనీయుడు ఉమామహేశ్వరరావు

నరసాపురం టౌన్: ఎంతోమంది ఆకలి తీరుస్తున్న వాతాడి ఉమా మహేశ్వరరావు అందరికీ ఆదర్శనీయుడని టిడిపి పట్టణ అధ్యక్షుడు జక్కం శ్రీమన్నారాయణ అన్నారు. గురువారం నరసాపురం చిన కనకదుర్గమ్మ (చిట్టితల్లి) ఆలయం వద్ద టిడిపి మండల అధ్యక్షుడు వాతాడి ఉమా మహేశ్వరరావు (శీను) పుట్టినరోజు సందర్భంగా అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా శ్రీమన్నారాయణ మాట్లాడారు. కార్యక్రమంలో నాయకులు సంకు భాస్కరనాయుడు, కొల్లు పెద్దిరాజు, కటకంశెట్టి పెద్దిరాజు పాల్గొన్నారు.

పెన్నాడలో చోరీకి యత్నం

దొంగను స్తంభానికి కట్టేసిన స్థానికులు

పాలకోడేరు: పెన్నాడలో ఓ వ్యక్తి ఇంట్లోకి చొరబడి దొంగతనం చేయడానికి ప్రయత్నిస్తూ పట్టుబడ్డాడు. గ్రామానికి చెందిన శిడగం వినాయకరావు ఇంటిలో ఈ ఘటన చోటు చేసుకుంది. గురువారం ఉదయం 11 గంటలకు వినాయకరావు భార్య హైమావతితో పిల్లల స్కూల్ ఫీజు చెల్లించేందుకు ఇంటికి గడియ పెట్టి విస్సాకోడేరు వెళ్లారు. ఇది గమనించిన దుండగుడు ఇంటిలోకి ప్రవేశించి బీరువా పగలగొట్టి చోరీకి ప్రయత్నించాడు. అప్పుడే ఇంటికి వచ్చిన వినాయకరావు దంపతులు తలుపు తెరిచి ఉండాన్ని గమనించి హడావడీగా లోనికి వెళ్లారు. బీరువాలో వస్తువులను చెల్లా చెదురుగా పడేసిన దుండగుడు తమను చూసి తప్పించుకునే ప్రయత్నం చేసినట్లు వినాయకరావు తెలిపారు. అతనిని పట్టుకుని స్థానికుల సాయంతో ఇంటి ఆవరణలోని స్తంభానికి కట్టేసి పోలీసులకు సమాచారం అందించారు. పాలకోడేరు పోలీస్ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని దొంగను అదుపులోకి తీసుకున్నారు. అనంతరం వేలిముద్రలు సేకరించారు. వారం రోజులుగా దొంగలు పెన్నాడ పరిసర ప్రాంతాల్లో సంచరిస్తున్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఈ ఘటనపై ఇంకా కేసు నమోదు చేయలేదని పాలకోడేరు పోలీసులు వెల్లడించారు.

వివాహిత ఆత్మహత్య

ఉండి: భర్త పుట్టింటికి తీసుకెళ్లడం లేదని మనస్తాపం చెంది మహిళ కలుపుమందు తాగి ఆత్మహత్యకు పాల్పడిన సంఘటన కలిగొట్ల గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం. విజయనగరంకు చెందిన పంచుర్పు రమేష్ తన భార్య కుమారితో కలిసి కలిగొట్ల గ్రామానికి చెందిన రామభద్రరాజు చెరువుల వద్ద నివాసం ఉంటూ పని చేసుకుంటున్నారు. కుమారి తన పుట్టింటికి తీసుకెళ్లమని భర్త రమేష్‌ను పలుమార్లు అడగ్గా రమేష్ తీసుకెళ్లలేదు. దీంతో కుమారి మనస్తాపం చెంది మంగళవారం సాయంత్రం కలుపు మందు తాగి బుధవారం మృతి చెందిందని, భర్త రమేష్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

ప్రజాశక్తి ప్రతి అక్షరం - ప్రజల పక్షం
పత్రిక పంపిణీలో ఇబ్బందులున్నవారు ఈక్రింది నెంబర్లను సంప్రదించండి
ఏలూరు జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 94900 99190
పశ్చిమగోదావరి జిల్లా సర్క్యులేషన్ వివరాల కోసం సెల్: 83339 88814

సమస్యల వలయంలో.. పెనుగొండ పంచాయతీ

ప్రజాశక్తి - పెనుగొండ

మేజర్ పంచాయతీ అయిన పెనుగొండలో అన్నీ సమస్యలే. ఏ వీధికి వెళ్లినా చెత్త కుప్పలే దర్శనమిస్తున్నాయి. దీనికితోడు డ్రెయినేజీ వ్యవస్థ అస్తవ్యస్తంగా ఉండడం, వీధి దీపాలు వెలగకపోవడం, తాగునీరు పైప్‌లైన్లు శిథిలావస్థకు చేరడం, మురుగునీరు రోడ్లపైనే ప్రవహించడంతో స్థానికులు నానా అవస్థలు

మురుగు వద్దే కుళాయి నీరు పట్టుకుంటున్న వైనం

ప్రజల అవస్థలు

పడుతున్నారు. చెత్త కుప్పలు పెరిగిపోయి దుర్వాసన రావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. దీంతో దోమలు విజృంభిస్తున్నాయని, రోగాల బారిన పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీలో 25 వేల పైబడి జనాభా నివసిస్తున్నారు. 20 వార్డులు ఉన్న పంచాయతీలో 32 మంది పారిశుధ్య కార్మికులు పనిచేస్తున్నారు. అయినా ఎక్కడ పడితే అక్కడ చెత్త కుప్పలు రోజుల తరబడి ఉండిపోతున్నాయని, అధికారుల దృష్టికి తీసుకెళ్లినా నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరిస్తున్నారని వాపోతున్నారు. ప్రభుత్వాలు మారినా సమస్యలు మాత్రం పరిష్కారం కావడం లేదని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పంచాయతీ కార్యదర్శి దృష్టికి సమస్యలు తీసుకెళ్లినా ప్రయోజనం లేదని, ఇప్పటికైనా సంబంధిత అధికారులు సమస్యలను పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు.

అధ్వానంగా ఉన్న డ్రెయినేజీ వ్యవస్థ

ఉండి ఎంఇఒ - 2గా వినాయకుడు

ప్రజాశక్తి - ఉండి

మండల రెండో ఎంఇఒగా బొక్కా వినాయకుడు గురువారం ఉద్యోగ బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ఎంఇఒ బొక్కా వినాయకుడును పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం ఇచ్చారు. తాను గతంలో వీరవాసరం, ద్వారకాతిరుమల, పోడూరు, భీమవరం రూరల్, భీమవరం అర్బన్ తదితర ప్రదేశాలలో వినాయకుడు తెలిపారు.

స్వర్ణలతకు అరుదైన అవార్డులు

ప్రజాశక్తి - పాలకోడేరు

సెయింట్ జాన్స్ వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షురాలు, సెయింట్ జాన్స్ ఇంగ్లీష్ మీడియం హైస్కూల్ ప్రధానోపాధ్యాయిని డాక్టర్ డిఆర్.స్వర్ణలతకు అరుదైన రెండు అవార్డులు లభించాయి. సమాజానికి స్వర్ణలత అందిస్తున్న సేవలకు గాను ఇంటర్నేషనల్ గౌరవ డాక్టరేట్ తోపాటు, ఇంటర్నేషనల్ గౌతమ బుద్ధ సర్వీస్ అవార్డులు దక్కాయి. హైదరాబాద్ బిర్లా మందిర్‌లో గురువారం అమెరికాకు చెందిన డాక్టర్ రామకృష్ణ సాహె, ప్రెసిడెంట్ ఆఫ్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ ఆఫ్ అమెరికా, చికాగో, మనం ఫౌండేషన్ అధినేత డాక్టర్ చక్రవర్తి చేతుల మీదుగా డాక్టరేట్, గౌతమ బుద్ధ సర్వీస్ అవార్డును స్వర్ణలత అందుకున్నారు. ఈ అవార్డులను భారతదేశంలో ప్రేమతో సామాజిక సేవ చేస్తూ, దేశం పట్ల ప్రేమ, మానవత్వం, శాంతియుత, మానవ హక్కుల కోసం కృషి చేస్తున్న వారిని గుర్తించి ఈ అవార్డ్స్ ఇవ్వడం జరిగిందని స్వర్ణలత తెలిపారు.

అవార్డు అందుకుంటున్న స్వర్ణలత

పత్రికా ప్రకటన

మా క్లయింట్ శ్రీ **ఈదర వెంకట రామారావు,** తండ్రి: ఈదర వెంకటరమణ ప్రసాద్, ఏలూరు వాస్తవ్యులు ఈదరవారి వీధి, రామచంద్రరావు పేట, ఏలూరు, ఏలూరు జిల్లా వారు ఇచ్చిన వివరణ మేరకు ఈ క్రింది ప్రకటన జారీ చేయడం అయినది.

పైన తెలిపిన నా క్లయింట్ ప్రైవేటు కంపెనీ యందు ఉద్యోగము చేసుకొనుచు జీవించుచున్నారు. నా క్లయింట్‌కు వారి పూర్వీకుల ద్వారా స్థాపితమైన వెంకట్రామ & కో అను సంస్థ నందు మాత్రమే భాగస్వామ్యం కలదు. ఈ సంస్థ తప్ప వేరే ఇతర సంస్థలతోనూ ఏవిధమైన వ్యాపార సంబంధము కానీ, ఏవిధమైన లావాదేవీలు గాని కలిగియుండలేదని తెలియచేయుచున్నాము. ఏ వ్యక్తులైన నా క్లయింట్ పేరిట ఏవిధమైన లావాదేవీలు జరిపిన సదరు లావాదేవీలకు సంబంధించి నా క్లయింట్‌కు ఎటువంటి బాధ్యత ఉండదని ఈ ప్రకటన ద్వారా యావన్మందికి తెలియపరచటమైనది. ఏ వ్యక్తులైన నా క్లయింట్ పేరిత ప్రత్యక్షముగా గాని, పరోక్షముగా గాని నా క్లయింట్ పేరును ఉపయోగించుకుని ఏవిధమైన లావాదేవీలైన జరిపినచో సదరు వ్యక్తులపై అవసరమగు సివిల్ మరియు క్రిమినల్ చర్యలు తీసుకొనబడునని ఇందు మూలముగా తెలియపరచటమైనది.

P.BHASKARA NARASIMHA MURTHY
Advocate, Eluru

నవోదయ స్కూల్‌కు హోలీ ఏంజెల్స్ విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి - ఆచంట

జవహర్ నవోదయ విద్యాలయానికి కొడమంచిలి హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని కరస్పాండెంట్ కె.రవి కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచుల ఛాంబర్ మండల అధ్యక్షులు సుంకర సీతారామ్ విద్యార్థులను ప్రత్యేకంగా అభినందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మునుపెన్నడూ లేనివిధంగా మండల స్థాయిలో ఇద్దరు విద్యార్థులు కొడమంచిలి హోలీ ఏంజెల్స్ ఇంగ్లీష్ మీడియం స్కూల్ విద్యార్థులు ఎంపికయ్యారని తెలిపారు. అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన విద్యార్థులు మట్టిలో మాణిక్యాలు అని కొనియాడారు. ఇంకా బాగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని అకాంక్షించారు. ఈ కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపల్ కె.కృష్ణవేణి, సొసైటీ అధ్యక్షులు కాండ్రేగుల సత్యనారాయణ, దేవస్థానం అధ్యక్షులు బాలనాగు నరేష్, రైతు సంఘం అధ్యక్షులు మన్నె సుబ్బారావు పాల్గొన్నారు.

చెట్లు నరికిన వారిపై చర్యలు తీసుకోవాలి

గొల్లలకోడేరు సంజన అపార్టుమెంట్ వాసుల ఆందోళన

ప్రజాశక్తి - పాలకోడేరు

గొల్లలకోడేరు గ్రామంలోని సంజన ఎస్టేట్‌లో చెట్లు తొలగించిన వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని అపార్ట్మెంట్ వాసులు డిమాండ్ చేశారు. సంజన డెవలపర్స్ యజమాని డి.జాన్ వెస్లీ సజన ఎస్టేటులోని చెట్ల కారణంగా తాను అభివృద్ధి చేసిన భూమి సరిగ్గా కనిపించడం లేదంటూ ఈ ఏడాది ఏప్రిల్‌లో 68 చెట్లను నరికించారని పేర్కొన్నారు. ఉపాధి హామీ నిధులతో ఎస్టేటులో నిర్మించిన సిమ్మెంటు రహదారి వెంబడి 2019లో అప్పటి పంచాయతీ కార్యదర్శి శంభుమాదవ్ అనుమతితో మొక్కలు నాటి వాటిని సంరక్షించామన్నారు. చెట్లు తొలగించిన వ్యక్తిపై స్పందనలో ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకూ ఎటువంటి చర్యలు తీసుకోలేదని పేర్కొన్నారు

నోటీసు

మహారాజశ్రీ తణుకు నాల్గవ అదనపు జిల్లా జడ్జి గారి కోర్టులో

I.A.No. 577/2022
in S.R.A.S.No. 2261/2022

బిట్వీన్:

జయహింద్ స్కియాకీ లిమిటెడ్, పూణె, రిప్రజెంటెడ్ బై ఇట్స్ మేనేజింగ్ డైరెక్టరు అండ్ అనదర్

...పిటీషనర్స్ /అప్పెలెంట్స్

అండ్

గోపీ పౌల్ట్రీ మెష్ కంపేనీ, ప్రొ: ద్వారంపూడి యోగ నాగి రెడ్డి, తండ్రి: నాగేంద్ర రెడ్డి, పల్లపు వీధి, పెనుమంట్ర గ్రామం, పశ్చిమ గాదావరి జిల్లా.

...రెస్పాండెంట్సు

ఇందుమూలముగా పైన తెలిపిన రెస్పాండెంటుకు తెలియజేయునది ఏమనగా, పై నెంబరు గ్రంథమునందు పిటీషనర్సు /అప్పిలెంట్స్ ఓ.ఎస్.నెం.126/2014 నందు తణుకు సీనియర్ సివిల్ జడ్జి కోర్టు వారిచే జారీ చేయబడిన ది. 27-06-2022 డిక్రీ అండ్ జడ్జిమెంట్ పై, పైన తెలిపిన కోర్టు నందు అప్పీలు దాఖలు చేయుటలో జరిగిన 15 రోజుల ఆలస్యంను మన్నించమని కోరుచూ ఐ.ఎ.నెం. 577/2022 నందు మీకు నోటీసు ఆర్డరు చేయగా సదరు నోటీసు మీపై అమలుకు పలుమార్లు ప్రయత్నించిననూ మీకు అమలు కానందున ఈ నోటీసు పూర్వకముగా తెలియజేయునది ఏమనగా పైన తెలిపిన ఐ.ఎ.నెం. 577/2022 తేదీ **14-07-2023న వాయిదా కలదు. సదరు వాయిదాకు మీరు సదరు తేదీన ఉదయం గం॥ 10:30 ని॥లకు మీరు స్వయంగా గాని, మీ న్యాయవాది ద్వారా గాని హాజరు అయ్యి ఆక్షేపణలు ఏమైనా ఉన్న తెలుపగలరు.** లేని ఎడల మీ పరోక్షములో సదరు పిటీషను విచారించబడును.

వంగూరి కిషోర్
తణుకు, న్యాయవాది, తణుకు.
20-6-23. సెల్: 99890 27768

అభివృద్ధి పథంలో భీమవరం : ఎంఎల్‌ఎ గ్రంథి

ప్రజాశక్తి - భీమవరం రూరల్

రాష్ట్రంలోనే భీమవరం పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్ది అభివృద్ధి పథంలో నడిపిస్తున్నామని ఎంఎల్‌ఎ గ్రంథి శ్రీనివాస్ అన్నారు. గురువారం పట్టణంలోని ఒకటోవ వార్డు మెంటే వారి తోటలో రూ.కోటీ 20 లక్షల నిధులతో చేపట్టిన సీసీ రోడ్ల నిర్మాణాల పనులను ఎంఎల్‌ఎ పరిశీలించారు. పనులను త్వరంగా పూర్తి చేయాలని కాంట్రాక్టర్ గంగుమోలు వాసును, అధికారులను ఆదేశించారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ మెంటేవారితోటలో శాశ్వత ప్రాతిపదికన సీసీ రోడ్ల నిర్మాణం చేపట్టినట్లు తెలిపారు. పట్టణంలో రైల్వే అండర్ టన్నెల్స్ వల్ల ట్రాఫిక్ సమస్యకు పరిష్కారం దొరికిందన్నారు. భీమవరం పట్టణాన్ని ఉత్తర దిశగా కూడా అభివృద్ధి చేసి మరింతగా విస్తరింపజేయడానికి ఈ రోడ్లను నిర్మిస్తున్నట్లు తెలిపారు. వండర్ కిడ్స్ స్కూల్ దగ్గర నుంచి బైపాస్ రోడ్డు వరకూ 380 మీటర్లు మేర, అలాగే రైల్వే అండర్ పాస్ బ్రిడ్జి వరకూ 250 మీటర్ల మీద సీసీ రోడ్డు నిర్మిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో గౌడ కార్పొరేషన్ డైరెక్టర్ కామన నాగేశ్వరరావు, మావుళ్లమ్మ దేవస్థానం ధర్మకర్త ముత్యాల రామారావు, ముత్యాల బోసుబాబు, రామిశెట్టి జయ సూర్య పాల్గొన్నారు.

25న లక్ష్మీనారాయణ స్వామి దేవస్థానం ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం

నూతన కమిటీ ఛైర్మన్‌గా జి.వెంకట పానకాలు

ప్రజాశక్తి - పాలకొల్లు

ఈ నెల 25వ తేదీ ఆదివారం పాలకొల్లు అష్టభుజ లక్ష్మీనారాయణ స్వామివారి దేవస్థానం నూతన ధర్మకర్తల మండలి ప్రమాణ స్వీకారం చేయనుంది. నూతన కమిటీ ఛైర్మన్‌గా జవ్వాజి వెంకట పానకాలు ప్రమాణ స్వీకారం చేస్తారు. సభ్యులుగా నున్న వెంకట కోటేశ్వరరావు, చల్లా లక్ష్మీ నారాయణమూర్తి, పొట్టిపాటి అన్నరాణి, ఉప్పలపు భారతీలక్ష్మి, కెల్లా భూలక్ష్మి, ఎక్స్ అఫీసియా మెంబర్‌గా కర్రి వెంకట శ్రీనివాసాచార్యులు ప్రమాణస్వీకారం చేయనున్నారు. సాయంత్రం 5 గంటలకు ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్, ఎంఎల్‌ఎ నిమ్మల రామానాయుడు సారధ్యంలో అభినందన సభ ఏర్పాటు చేసినట్లు ఆలయ ఇఒ పిటి గోపాలరావు తెలిపారు.

ప్రకటన

In The Court Of The IV Addl. District Judge :: W.G.Dist :: Tanuku

G.W.O.P.No. 42/2022

(In the matter of Minor Child to accord permission to his sell the Petition Schedule Property relating to 1) Sathuluri Venkata Sahil 2) Kum. Sathuluri Nirupama Aishwarya being minors represented by their Mother /Guardian Sathuluri Vijaya Lakshmi)

Between:

Petitioner: Sathuluri Vijaya Lakshmi

AND

Respondent: Nill

పై నెంబరు పిటీషను గ్రంథములో లేటు సాతులూరి నరిసింహని మరియు పిటీషనరు సాతులూరి విజయలక్ష్మి గారు సంతానము సాతులూరి వెంకట సుహీల్ మరియు సాతులూరి నిరుపమ ఐశ్వర్య గార్లకు చెందిన జాయింటు ఆస్థి అయిన ఈ దిగువ షెడ్యూలు ఆస్థిని అమ్ముటకు కొరకు కోర్టు అనుమతి నిమిత్తం పై పిటీషను గ్రంథము దాఖలు చేసియున్నారు. ఇందుపై ఎవరికైనా అభ్యంతరములు ఉన్న ఎడల పై కోర్టు వారి ఎదుట **ది.04-07-2023 సం॥రం తేదీన గం॥ 10:30 ని॥లకు హాజరు అయ్యి వారి ఆక్షేపణలు శ్రీ కోర్టు వారికి తెలియపర్చు కొనవలసినదిగా తెలియజేయడమైనది.**

PETITION SCHEDULE

Item No.1:

A) West Godavari District, Tanuku SRO, Tanuku Sub Division, Tanuku Mandal, Tanuku Municipality area, Tanuku Vemavasram Village, Zirayoti Land, bearing R.S.No. 6/7A, nearer D.No. 17-140, new D.No. 17-14-8, Flat No. 5 (505) in Siri Plaza Apartments constructed by Siri Constructions an extent of 1234 Sq. Feet with common area Two Bed Room Flat within the following boundaries:

East: Corridor. ***West:*** Corridor. ***South:*** Corridor. ***North:*** Open to Sky.

Within the boundaries in an extent of 1234 Sq. Feet Two Bed Room flat within the above boundaries with Car parking and Electricity service connection 036138 along with scooter parking with undivided joint right of site to an extent of 51.8 Sq. Yards with all easementary rights therein.

B) The above flat situated in apartments constructed under A.P. Regulation and Penalization unapproved land illegal rules 2007 after getting regularization from Tanuku Municipality under LRS No. 71/2008 G1 dated 08-04-2020 an extent of 2072 Sq. Yards site within the following boundaries:

East: Site in R.S.No. 6/4 and 5 119'-08''.
West: Municipal Road 117'-08''.
South: Site in R.S.No. 6/7A 154'-00''.
North: Site in R.S.No. 6/1 160'-04''.

ITEM NO.2: 1/6th Undivided share of the minor in the above mentioned flat of 1234 Sq.feet and the Joint right of site to an extent of 51-8 Sq. Yards which comes to 205.66 Sq. feet with all easementary rights therein.

Tanuku, **N.V.S.S.P.RAMA MOHAN**
22-06-2023. **N.V.S.RAMANUJUM**
Advocates, Tanuku.
Cell: 99088 22433, 98483 69653

నేడు, రేపు 'పంట మునిగింది.. పరిహారం ఇవ్వండి'

ప్రజాశక్తి - పోడూరు

ఈ నెల 24, 25 తేదీల్లో పంట మునిగింది పరిహారం ఇవ్వండి కార్యక్రమాన్ని మండలంలోని అన్ని గ్రామాల్లో నిర్వహించనున్నామని టిడిపి మండల అధ్యక్షులు గొట్టుముక్కల సూర్యనారాయణ రాజు అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ రైతు వ్యతిరేక విధానాల వల్ల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారన్నారు. రైతులకు అందించాల్సిన కనీస సౌకర్యాలూ కూడా ఇవ్వకుండా కనీసం గిట్టుబాటు ధర కూడా సరిగ్గా అందించకుండా అదనంగా ధాన్యాన్ని వసూలు చేస్తున్నారన్నారు. రాబోయే రోజుల్లో టిడిపి అఖండ విజయాన్ని సాధిస్తుందన్నారు. రైతులకు జరిగిన నష్టాన్ని పరిశీలిస్తూ మేలో తూర్పు, పశ్చిమగోదావరి జిల్లాల్లో పర్యటించి రైతులకు జరిగిన నష్టాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లినా స్పందన లేదన్నారు. ఈ క్రమంలో 24, 25వ తేదీల్లో కార్యక్రమం చేపట్టనున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాలవలస తులసీరావు, మేడిశెట్టి బుజ్జి, దేవరపు దొరబాబు, భూపతి రాజు సత్యనారాయణ రాజు, పెన్మత్స రామబద్ర రాజు పాల్గొన్నారు.

మండల పరిషత్ సమావేశం వెలవెల

ప్రజాశక్తి - ఆకివీడు

మండల ప్రజా పరిషత్ సాధారణ సమావేశం గురువారం స్థానిక పరిషత్ భవనంలో ఎంపిపి కటారి రాజ్యలక్ష్మి అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశంలో మండల పరిషత్ సభ్యులు నామమాత్రంగా హాజరయ్యారు. మండలంలో 8 మంది సభ్యులు ఉండే ఆకివీడు నగర పంచాయతీ కావడంతో మిగిలినవి ఎన్నికైన సభ్యులు 12 స్థానాలు మాత్రమే. వారిలో వేదిక ముందు ఇద్దరు కూర్చున్నారు. ఎంపిపి, ఇద్దరు ఉపాధ్యక్షులు, కో ఆప్షన్ సభ్యులు వేదికపై ఉన్నారు. హాల్లో సుమారు 30 మంది అధికారులు, సిబ్బంది ఉన్నారు. వీరికి తోడు కొందరు సర్పంచులు హాజరయ్యారు. ఈ నేపథ్యంలో సమావేశాన్ని మమ అనిపించారు. ప్రభుత్వ శాఖలో సైతం మరో 10 నుంచి 12 శాఖల ప్రతినిధుల హాజరు కాలేదు. ఎండిఒ వాణి విధుల్లో చేరి నాలుగు రోజులైంది. వచ్చే సమావేశానికి సమన్వయంతో సభ్యులు హాజరయ్యేట్టు చూస్తామని ఎండిఒ, ఎంపిపిలు ప్రకటించారు. సమావేశంలో జెడ్‌పిటిసి వేగేశ్న వెంకటరాజు, తహశీల్దార్ విజయలక్ష్మి పాల్గొన్నారు.

విద్యార్థుల భవిష్యత్తే లక్ష్యం : ఎంఎల్‌సి

ప్రజాశక్తి - పోడూరు

ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులకు మంచి భవిష్యత్తును అందించడమే సిఎం జగన్మోహన్ రెడ్డి ఆశయమని ఎంఎల్‌సి కవురు శ్రీనివాస్ అన్నారు. జమ్ము నిఖిలేష్ 22వ జయంతి సందర్భంగా జిన్నూరులోని జెడ్‌పి హైస్కూల్లో నిఖిలేష్ ఛారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో ప్రథమ, ద్వితీయ స్థానాల్లో నిలిచిన విద్యార్థులకు నగదు బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమానికి ఎంఎల్‌సి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ ఏడాది 10వ తరగతి పరీక్షా ఫలితాల్లో 537 మార్కులతో ప్రథమ స్థానంలో నిలిచిన యర్రంశెట్టి పవన్ వెంకట సాయికి రూ.10 వేల నగదు, 460 మార్కులతో రెండో స్థానంలో నిలిచిన బొంతు నీరజ్‌కు రూ.7,500 నగదు, 449 మార్కులతో మూడో స్థానంలో నిలిచిన కేతా జ్యోతిష్మాకు రూ.5 వేల నగదుతో పాటు నిఖిలేష్ మెమోరియల్ ప్రతిభా అవార్డులను ఎంఎల్‌సి, నిఖిలేష్ తల్లిదండ్రులైన గ్రామ సర్పంచి జమ్ము బేబీ మహాలక్ష్మి, ఎఎంసి డైరెక్టర్ జమ్ము మత్యుంజయరావు అందజేశారు. ఈ సందర్భంగా శ్రీనివాస్ మాట్లాడుతూ నిఖిలేష్ చిన్న వయసులోనే ఈ లోకాన్ని విడిచి వెళ్లడం బాధాకరమన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి సబ్బితి సుమంగళి సాగర్, జున్నూరు సొసైటీ ఛైర్మన్ డిటిడిసి బాబు, డిసిఎంఎస్ మాజీ ఛైర్మన్ యడ్ల తాతాజీ పాల్గొన్నారు.

పేరు మార్పు

ఏలూరు జిల్లా, ఏలూరు మెయిన్ బజార్, గడియారపు స్తంభం వద్ద, H.No. 7A-11-12/2 లో నివాసం ఉంటున్న నయీమా సుల్తానా అనే నయిమా సుల్తాన బేగ్, W/o. అసుదుల్లా బేగ్, స్త్రీ, వయస్సు 45 సం॥లు అను నేను ఈ పేపరు ప్రకటన ద్వారా యావత్ ప్రజానీకానికి తెలియజేయడమైనది ఏమనగా, పై రెండు పేర్లు నాకు సంబంధించినవి మరియు నా స్నేహితులు, నా బంధువులు, వగైరాలు పై రెండు పేర్లతో నన్ను పిలువటం జరుగుతుంది. నా ఆధార్ నెంబర్: 886110917640 మరియు పదవ తరగతి మార్కు జాబితా రి.జి. నెం. 0198905

నయిమా సుల్తాన బేగ్
సెల్: 90633 98222

విత్తనాల దుకాణంలో తనిఖీలు

రైతుపై కేసు నమోదు అన్యాయం - అధికారుల తీరుపై స్థానికులు ఆగ్రహం

ప్రజాశక్తి - పాలకోడేరు

పెన్నాడలో అనుమతి లేకుండా వరి విత్తనాలు విక్రయిస్తున్న దుకాణాన్ని విజిలెన్స్ అధికారులు గురువారం తనిఖీ చేశారు. రూ.1.86 లక్షలు విలువ చేసే 49.65 క్వింటాళ్ల వరి విత్తనాలను స్వాధీనం చేసుకుని రైతు ఎస్.రామచంద్రరావుపై కేసు నమోదు చేసినట్లు తెలిపారు. ఈ తనిఖీల్లో విజిలెన్స్ సిఐ పి.శివరామకృష్ణ, ఎఒ సురేష్, పాలకోడేరు మండల వ్యవసాయ శాఖ అధికారి వి. నారాయణరావు, సిబ్బంది పాల్గొన్నారు.

కేసు నమోదు అన్యాయం

ఏటా విత్తన పంట సాగుచేస్తూ స్థానిక రైతులకు విత్తనాలు సమకూర్చే రైతుపై విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేయడం అన్యాయమని స్థానికులు, రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. గ్రామానికి చెందిన ఎస్.రామచంద్రరావు విత్తన సాగు చేస్తుంటారని, ఆయన ఇంటికి మరమ్మతులు చేయించుకోవడంతో సాగు చేసిన విత్తన పంటను దగ్గర్లోని ఒక దుకాణాన్ని లీజుకు తీసుకుని అందులో నిల్వ చేసుకున్నట్లు తెలిపారు. అయితే విత్తన పంట సాగు చేసే రైతులు ఇంటి వద్ద మాత్రమే విత్తనాలు విక్రయించుకునే వెసులుబాటు చట్టంలో ఉందని తెలిఎరు. ఇంటికి మరమ్మతులు చేయించుకోవడంతో విత్తనాలు నిల్వ చేసుకునేందుకు ఇంటి వద్ద ఖాళీ లేక దుకాణం అద్దెకు తీసుకుని నిల్వ చేసుకున్నానని రామచంద్రరావు తెలిపారు. మండల వ్యవసాయ శాఖ అధికారి వి. నారాయణరావు మాట్లాడుతూ రైతు రామచంద్రరావు రబీ పంట కాలంలో ఎంటీయూ 1060, 1318, సంపద విత్తనాలు సాగు చేసినట్లు ఇ-పంటలో నమోదైందన్నారు. ఆయన సాగు చేసిన సర్వే నంబర్లో పంటను ఎక్కడా విక్రయించినట్లు నమోదు కాలేదని తెలిపారు. విత్తనాలను కేవలం దుకాణంలో నిల్వ చేయడం వల్లే విజిలెన్స్ అధికారులు కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

పాస్‌పోర్టు పోయినది

పశ్చిమ గోదావరి జిల్లా, పాలకోడేరు మండలం, శృంగవృక్షం గ్రామం, జవ్వాది వారి వీధి, డో.నెం. 10-14 గల మండపాక శ్రీనివాసు, తండ్రి: శ్రీరాములు అను నాయొక్క పాస్‌పోర్టు నెం. **G1927659 గల పాస్‌పోర్టు** ది.11-06-2023వ తేదీన శృంగవృక్షం శివాలయం వీధి నుండి జవ్వాది వారి వీధికి ఇల్లు మారుతుండగా నాయొక్క ఒరిజినల్ పాస్‌పోర్టు పడిపోయినది. కావున దొరికిన వారు ఈ క్రింఇ చిరునామాకు అందించగలరు.

మండపాక శ్రీనివాసు
తండ్రి: శ్రీరాములు, జవ్వాది వారి వీధి, డో.నెం. 10-14, శృంగవృక్షం, పాలకోడేరు మండలం, ప॥గో॥జిల్లా.
సెల్: 78423 09321